సాక్షి తిరుపతి

మంగళవారం ׀ 10 ׀ సెప్టెంబర్ ׀ 2024



అర్జీలకు పరిష్కారం చూపండి

గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అందే అర్జీలకు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. - 8లో



సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడవచ్చు

ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్నవారికి సీపీఆర్ చేయడం ద్వారా కాపాడవచ్చని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. - 8లో



వీసీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

జిల్లాలోని యూనివర్సిటీలకు వీసీలను నియమించేందుకు ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 81,178 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 25,463 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.25 కోట్లు సమరి ్పంచారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శించుకోగలగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

ప్రజా పరిష్కార వేదికకు 76 ఫిర్యాదులు



జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తినట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు నేరుగా ఎస్పీని సంప్రదించి 76 ఫిర్యాదులు అందజేశారు. ఆ ఫిర్యాదులను సంబంధిత పోలీస్‌స్టేషన్లకు ఆయన బదిలీ చేశారు. ఈ ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు ? బాధితులకు ఏం న్యాయం జరిగిందనేది త్వరలోనే తమ కార్యాలయంలో తెలియజేయాలని ఆదేశించారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు, ఇతర ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ తెలిపారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించండి



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్ వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన కూరగాయలను రైతులు కలెక్టరేట్ వద్ద గ్రీవెన్స్‌కు విచ్చేసిన వారికి విక్రయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మునగాకు కట్టను కొనుగోలు చేశారు. వ్యవసాయ అధికారులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసేలా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు, జిల్లా జెడ్పీఎస్ఎఫ్ డీపీఎం షణ్ముగం, ఏపీఎంఐపీ పీడీ సతీష్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బుజ్జి బొజ్జ గణపయ్య..




అయోధ్య బాలరాముడి రూపంలో గణనాథుడు



పల్లెవీధిలో గొడుగు నీడన లంబోదరుడు

ఆదిదేవుడిగా మొదటి పూజ అందుకునే బుజ్జి బొజ్జ గణపయ్య చవితి సందర్భంగా తిరుపతి నగరంలో వివిధ రూపాల్లో కొలువుదీరాడు. ఈ సందర్భంగా నగర వాసులు అన్నిటా విఘ్నాలు తొలగించి దీవించు తండ్రీ అంటూ విఘ్నేశ్వరున్ని దర్శించుకుంటున్నారు. చవితి వేడుకల్లో భాగంగా సోమవారం జిల్లావ్యాప్తంగా పలుచోట్ల గణనాథుని నిమజ్జనం అట్టహాసంగా జరిగింది. – తిరుపతి కల్చరల్



చందమామపై ఆశీనుడైన గౌరీతనయుడు



కొత్త వీధిలో ఊయల్లో కొలువైన ఉండ్రాలయ్య

గణేశా.. నమోనమామి

- వాడవాడలా ఏర్పాటు చేసిన 700 వినాయక విగ్రహాలు
- వివిధ రూపాల్లో భక్తులను కటాక్షించిన లంబోదరుడు
- వినాయక సాగర్ వద్ద పటిష్ట ఏర్పాట్లు
- అర్ధరాత్రి వరకు కొనసాగిన నిమజ్జనం
- తిలకించేందుకు తరలివచ్చిన వేలాదిమంది జనం



వినాయకసాగర్‌లో గణేశ్ నిమజ్జనం



గణేష్ మహరాజ్‌కీ.. జై అంటున్న యువతులు

తిరుపతి మంగళం: గణపతిపప్పు మోరియా.. జై బోలో గణపతి మహరాజ్‌కి జై అన్న నినాదాలతో సోమవారం తిరుపతి నగరం మార్మోగింది. వినాయకచవితి పండుగను పురస్కరించుకుని తిరుపతి నగరంలోని అనేక కూడళ్లల్లో 700 భారీ వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు స్థానిక ప్రజలు విశేషపూజలు నిర్వహించారు. మూడురోజుల పాటు అన్నదానాలు, ఉట్లు కొట్టడం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనేక ప్రాంతాల్లో వినాయకుని వద్ద ఉంచిన లడ్డూలను వేలం వేశారు. భక్తులు ఆయా ప్రాంతాల్లోని వినాయకుని చేతిలో ఉంచిన లడ్డూలను దక్కించుకునేందుకు వేలంలో పోటీపడ్డారు. మూడురోజుల అనంతరం వినాయకులను డప్పువాయిద్యాలతో భారీ ఊరేగింపుగా భక్తులు నిమజ్జనానికి తీసుకొచ్చారు. నగరంలోని వాడవాడలా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను స్థానిక ప్రజలు ఎంతో కోలాహలంగా రంగులు చల్లుకుంటూ, ఉట్లు కొట్టి భక్తిశ్రద్ధలతో చిన్నపిల్లలు, యువత, మహిళలు ఊరేగింపులో పాల్గొని నిమజ్జనం చేశారు.

పటిష్ట ఏర్పాట్లు

తిరుపతి నగరంలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాలను భక్తులు తీసుకొచ్చి వినాయకసాగర్‌లో నిమజ్జనం చేసేందుకు అనువుగా కార్పొరేషన్, పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, ఇరిగేషన్, టీటీడీ అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. వినాయక సాగర్‌ను విద్యుత్ అలంకరణతో ప్రత్యేకంగా అలంకరించారు. దీంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు భారీ క్రేన్‌లను అందుబాటులో ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధిక సంఖ్యలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లను అక్కడ ఉంచి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయించారు.

తరలివచ్చిన వేలాది మంది

హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లో నిర్వహించే వినాయక నిమజ్జనం తరహాలో తిరుపతిలోని వినాయకసాగర్‌లో చేపట్టిన నిమజ్జనాన్ని తిలకించేందుకు వేలాది మంది జనం తరలివచ్చారు. సాయం సంధ్యవేళ ఆహ్లాదకర వాతావరణంలో భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనాన్ని తిలకించారు. స్థానిక ప్రజలంతా కుటుంబ సమేతంగా వినాయకసాగర్‌కు తరలివచ్చారు.



వినాయక సాగర్ వద్ద నిమజ్జనోత్సవాన్ని తిలకిస్తున్న జనం



నిమజ్జనానికి ఊరేగింపుగా వస్తున్న వినాయక ప్రతిమలకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు





గణేష్ ప్రతిమను తీసుకొస్తున్న ఎమ్మెల్యే ఆరణి, వినాయక సాగర్‌లో నిమజ్జనోత్సవం

తుమ్మలగుంటలో ..

తిరుపతి రూరల్: ఆధ్యాత్మిక నినాదాలు ఒకవైపు.. డప్పు చప్పుళ్ల హోరు.. మంగళ వాయిద్యాలు.. యువకుల నృత్యాలు.. చిన్నారుల కేరింతల మధ్య తుమ్మలగుంటలో తమలపాకు వినాయకుడికి ఘన వీడ్కోలు పలికారు. మూడు రోజుల పాటు పూజలందుకున్న గణేశుడిని సోమవారం సాయంత్రం నిమజ్జనానికి తరలించగా జనం నీరాజనం పట్టారు. అనంతరం ఓటేరు చెరువులో నిమజ్జనం చేశారు.

భక్తులతో చెవిరెడ్డి, మోహిత్‌రెడ్డి మమేకం..

చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తమలపాకు వినాయకుని నిమజ్జనం ఏర్పాట్లను దగ్గర ఉండి పర్యవేక్షణ చేశారు. అంతకుముందు వేద పాఠశాల పిల్లల చేత మంత్రపఠనం చేయించారు. ఈ సందర్భంగా శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం ముందు ఉట్లోత్సవం నిర్వహించారు.



తమలపాకుల వినాయకుడికి పూజలు చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి

విరాళం



కలెక్టర్‌కు విరాళపు చెక్కును అందిస్తున్న డీఆర్‌ఓ

తిరుపతి అర్బన్: విజయవాడ వరద బాధితులకు సాయంగా జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తమ నెల జీతంలో సగం విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా డీఆర్వో పెంచలకిషోర్ రూ.25 వేలు విరాళాన్ని చెక్కు రూపంలో కలెక్టర్‌కు సోమవారం కలెక్టరేట్‌లో అందించారు.

వసూళ్ల సేన

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన రోజు నుంచి ఆ పార్టీ నేతలు అధికారాన్ని అడ్డు పెట్టుకుని వివాదాస్పద భూముల సెటిల్‌మెంట్లు, ఇసుక, మట్టి, గ్రావెల్, బడా వ్యాపారుల నుంచి వసూళ్లకు పాల్పడ్డారు. కూటమి నేతలు చెప్పింది వినకపోతే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లేదా మంత్రి లోకేష్ బాబు పేర్లు చెప్పి దందాలు చేస్తున్నారు. ఆ దందాల పరంపర ఇప్పుడు తిరుపతి, చిత్తూరు జిల్లాలోని మద్యం బార్లు, వైన్ షాపుల వైపు మళ్లించారు. ఆయా బార్ల యజమానులు, నిర్వాహకులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి ఎవరెవరు.. ఎంతెంత ఇవ్వాలో నిర్ణయించారు.

- ఎన్నికల్లో ఖర్చు చేశాం.. లాభాల్లో వాటా ఇవ్వాలంటూ హుకుం
- బార్లు, వైన్ షాపుల నుంచి వసూళ్లకు కూటమి నేతల ప్లాన్
- ఇవ్వకుంటే పోలీసులతో బెదిరింపులు, కేసులు
- తిరుపతిలో జనసేన ముఖ్యనేత నివాసంలో నాయకుల సమావేశంలో నిర్ణయం



సాక్షి ప్రతినిధి, తిరుపతి : దోచుకోవడానికి కాదేదీ అనర్హం అన్నట్లు కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రకృతి సంపదను దోచుకుంటున్నారు. ఇప్పుడు మరో కొత్త దందాకు సిద్ధమయ్యారు. ఎన్నికల్లో ఖర్చు చేశామని బెదిరిస్తూ వైన్ షాపులు, బార్ల నుంచి వసూళ్లు చేసుకునేందుకు ప్లాన్ వేశారు. తాజాగా సోమవారం తిరుపతిలో జనసేన ముఖ్య నేత నివాసంలో వారు నిర్వహించిన అత్యవసర సమావేశమే ఇందుకు నిదర్శనం. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో స్టార్ హోటళ్లతో కలిపి మొత్తం 44 బార్లు ఉండగా, ఒక్క తిరుపతి నగరంలోనే 22 బార్లు ఉన్నాయి. మద్యం అమ్మకాలు జరిగేది కూడా తిరుపతి నగరంలోనే. దీంతో తమకు వాటా ఇవ్వాలని టీడీపీ, జనసేన నేతలు బార్ల యజమానులపై ఒత్తిడి చేశారు. ఎవరూ స్పందించకపోవడంతో నగరంలోని ఓ డీఎస్పీని రంగంలోకి దింపారు. బార్ల నిర్వహణ, అమ్మకాల్లో లోపాలు ఉన్నాయంటూ కేసులు పెడుతామని బెదిరింపులకు దిగారు. ఐదేళ్ల పాటు సజావుగా నడుస్తున్న వ్యాపారంలో ఇప్పుడు ఇబ్బందులు తప్పేలా లేవని గ్రహించిన బార్ల యజమానులు తిరుపతి నగరంలోని జనసేన పార్టీ ముఖ్యనేతను ఆశ్రయించారు. ఆయన తన కుమారుడితో పాటు తన అన్న కుమారుడిని, వారికి తోడుగా తిరుపతి రూరల్ మండలానికి చెందిన టీడీపీ నాయకున్ని రంగంలోకి దింపారు. సదరు టీడీపీ నేత ఓ బార్‌కు యజమాని కావడం గమనార్హం.

కార్యకర్తల పేరిట వసూళ్లు చేసేలా..

నేరుగా తాము డబ్బులు వసూళ్లు చేస్తే ఏదో ఒక రోజు అబాసుపాలవుతామని భావించిన ఉమ్మడి పార్టీ నేతలు తమ పార్టీ కార్యకర్తలను ముందుంచారు. విషయం బయటపడినా వారిపైకి నెట్టవచ్చులే అనేది వారి ప్లాన్. ఐదుగురు నాయకులకు, నమ్మకస్తులైన మరో ఐదుగురి కార్యకర్తలకు వసూళ్ల బాధ్యతను అప్పగించినట్లు సమాచారం. ఈనెల 15వ తేదీలోపు మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ ఇచ్చేయాలని నిర్ణయించారు. వచ్చే నెల నుంచి ఒకటి నుంచి ఐదోతేదీలోపు అనుకున్న మొత్తాన్ని ఇవ్వాలని తేల్చిచెప్పారు. చేసేదేమీ లేక బార్ల యజమానులంతా ఒప్పుకున్నారు.

మామూళ్లు ఇవ్వకపోతే బడిత పూజే..

అక్రమ వసూళ్ల కోసం ఓ బార్ యజమానికి పూర్తి బాధ్యతలు అప్పగించారు. దీంతో అతను ఎన్నికల్లో రూ.కోట్లు ఖర్చు చేసి తమ నాయకుడిని గెలిపించుకున్నామని, వ్యాపారం సజావుగా సాగాలంటే.. అడిగినంత ఇవ్వాల్సిందేనంటూ హుకుం జారీ చేశారు. తాను నేరుగా సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేష్‌తో మాట్లాడుతానన్నారు. మీరు స్పందించకపోవడంతోనే పోలీసులు రంగంలోకి దిగారని, అడిగినంత ఇస్తే.. రాత్రి ఎంత టైం అయినా బార్లు తెరుచుకోవచ్చని హామీ ఇచ్చారు. బార్ అండ్ రెస్టారెంట్‌కు ఓ రేటు, స్టార్ హోటళ్లల్లో నిర్వహించే బార్లకు మరోరేటు నిర్ణయించారు. ప్రతి బార్ నుంచి నెలకు రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలు ఇవ్వాలని హుకుం జారీ చేశారు. కానీ అంత ఇచ్చుకోలేమని బతిమాలినా వినిపించుకోలేదని సమాచారం. ఈ విషయంపై ఐదుగురు నాయకులు సోమవారం జరిగిన సమావేశంలో ఓ నిర్ణయానికి వచ్చారు.

క్లుప్తంగా

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

- ఎర్రావారిపాళెం ఎస్ఐకి చార్జ్‌మెమో
- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎస్పీ

భాకరాపేట: తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం పోలీస్ స్టేషన్‌లో అవినీతికి పాల్పడిన ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయడంతో పాటు ఎస్ఐ ఎర్రిస్వామికి చార్జ్ మెమో ఇస్తూ తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీగంధం స్మగ్లింగ్ కేసులో ఒక నిందితుడి భార్యాబిడ్డలను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు అందిన సమాచారం మేరకు విచారణ చేపట్టారు. ఈ విచారణలో వాస్తవాలు వెలుగు చూడడంతో కానిస్టేబుళ్లు దేవేంద్రనాయక్, గుర్రప్పపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఇద్దరిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఎస్ఐ ఎర్రిస్వామికి చార్జ్ మెమో ఇచ్చారు. భాకరాపేట సర్కిల్ పరిధిలో పోలీసుల అవినీతి, అక్రమాలపై జిల్లా ఎస్పీ తీసుకుంటున్న చర్యల పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మిగిలిన సీట్లకు 11న కౌన్సెలింగ్

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాలలో పారా మెడికల్ డిప్లొమాలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 11న కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పీపీ చంద్రశేఖరన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీలో 9 సీట్లు, డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్‌లో 3 సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు రూ.7700 ఫీజు అదే రోజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు మరిన్ని వివరాలకు 94408 79943 నంబరులో సంప్రదించాలని కోరారు.

గంజాయి అక్రమ రవాణాపై నిఘా



రేణిగుంట రైల్వేస్టేషన్‌లో సమావేశమైన అధికారులు

రేణిగుంట: రైళ్లలో గంజాయి, ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణాపై నిఘా పెట్టి నిలువరించేందుకు కృషి చేయాలని రేణిగుంట స్టేషన్ మేనేజర్ శేషగిరినాథరెడ్డి సూచించారు. రైలు ప్రమాదాలు, విపత్తుల నివారణకు రేణిగుంట వీఐపీ లాంజ్‌లో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైళ్లలో గంజాయి అక్రమ రవాణా, రైల్వేల ప్రాంగణంలో కోడ్ కంట్రోల్ మేనేజ్‌మెంట్, విపత్తుల నిర్వహణ, విదేశీ వ్యక్తి కదలికలు, మానవ అక్రమ రవాణా, విధ్వంసకర సంఘటనలు, వరద విపత్తులపై రైల్వే అధికారులతో చర్చించారు. అన్ని శాఖల సమన్వయంతో రైల్వే స్టేషన్‌లో సేఫ్టీ చర్యలు పటిష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు బాబురావు, ఎస్ఎస్ రెడ్డి, ఐపీఎఫ్ సందీప్‌కుమార్, రైల్వే అధికారులు నాగభూషణం, స్వామినాథ్, శివప్రసాద్, శ్రీహరిరావు, సుధాకర్, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగని చవితి వివాదం

- ఇరువర్గాల్లోని 40 మందిపై కేసులు
- కేవీబీపురంలో కొనసాగుతున్న ఉద్రిక్తత
- అరెస్టుకు ససేమిరా అంటున్న రెండు వర్గాలు
- భారీగా పోలీసుల మోహరింపు
- అర్ధరాత్రి రిమాండ్‌కు తరలించేందుకు పోలీసుల వ్యూహం
- పెరిందేశం, రాగిగుంట గ్రామాల్లో కొనసాగుతున్న పోలీస్ పికెటింగ్



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ రవిమనోహరాచారి

కేవీబీపురం (వరదయ్యపాళెం): సత్యవేడు నియోజకవర్గం కేవీబీపురం మండలంలో వినాయక చవితి ఉత్సవాల్లో ఇద్దరు యువకుల అత్యుత్సాహం రెండు గ్రామాల మధ్య పరస్పర ఘర్షణ వాతావరణానికి దారితీసిన విషయం తెలిసిందే. దీంతో రెండు రోజులుగా రాగిగుంట, పెరిందేశం గ్రామాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఈ పరిస్థితుల నుంచి రెండు గ్రామాల్లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడం తిరుపతి జిల్లా పోలీసులకు పెను సవాలుగా మారింది. రెండు రోజులుగా కేవీబీపురం పోలీస్ స్టేషన్‌లోనే తిష్ట వేసిన అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, పుత్తూరు డీఎస్పీ రవికుమార్, ఇతర పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

అరెస్టుకు ససేమిరా ..

ఇరువర్గాలపై కేసులు నమోదైనప్పటికీ వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడం పోలీసులకు పెను సవాల్‌గా మారింది. రాగిగుంట గ్రామానికి చెందిన 17 మందిపై కేసులు నమోదు చేయగా వారిని స్టేషన్‌కు పిలిపించి సంతకాలు నమోదు చేసుకుని వదిలిపెట్టారు. వారిని వదిలేందుకు శ్రీకాళహస్తికి చెందిన ఓ రాజకీయ పార్టీ నేత పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఇదే కేసులో పెరిందేశం దళితవాడకు చెందిన 23 మందిపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్టుకు పోలీసులు పట్టుబడుతున్నారు. ఒకే కేసులో బీసీ వర్గాలకు చెందిన వారికి ఒక న్యాయం, దళిత వర్గాలకు మరో న్యాయమా అంటూ పెరిందేశం గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. వారిని అరెస్టు చేయందే తాము అరెస్టు కామని తేల్చి చెబుతున్నట్లు సమాచారం. ఇప్పటికే పెరిందేశంకు చెందిన కొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటికీ వారిని ప్రత్యేక వాహనంలో రిమాండ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నా వారిని పెరిందేశం గ్రామస్తులు సోమవారం రాత్రి వరకు అడ్డుకున్నారు. అయితే వారిని అర్ధరాత్రి అయినా రిమాండ్‌కు తరలించేందుకు గట్టి భద్రతా ఏర్పాట్లను చేపడుతున్నారు.

రెండు గ్రామాల్లో పోలీస్ పికెటింగ్

పెరిందేశం, రాగిగుంట గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ కొనసాగుతోంది. సీఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో రెండు గ్రామాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా చర్యలు చేపడుతున్నారు. అంతేకాక శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్ రెడ్డి, ఏఎస్పీ రవిమనోహరాచారి రెండు గ్రామాలను సందర్శించి గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. హింస వల్ల ఇబ్బందికర పరిస్థితులు తప్ప శాంతియుత పరిస్థితులు రావని వారు సూచించారు.

ఇరువర్గాలపై కేసులు

పరస్పర దాడులకు పాల్పడిన పెరిందేశం, రాగిగుంట గ్రామాలకు చెందిన పలువురిపై కేసులు నమోదైనట్లు పుత్తూరు రూరల్ సీఐ భాస్కర్ నాయక్ తెలిపారు. పెరిందేశం గ్రామానికి చెందిన 23 మంది, రాగిగుంట గ్రామానికి చెందిన 17 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు తెలిపారు. అయితే కేసు నమోదు చేసిన వారి వివరాలను బయటకు పొక్కనియ్యకుండా గోప్యంగా ఉంచడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.

ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు : ఏఎస్పీ రవిమనోహరాచారి

రాగిగుంట గ్రామంలో ఇద్దరు యువకులు చేపట్టిన అత్యుత్సాహ పరిస్థితుల వల్ల రెండు గ్రామాల్లో శాంతిభద్రతలు అదుపు తప్పి ఘర్షణ వాతావరణానికి కారణమైందని ఏఎస్పీ రవిమనోహరాచారి తెలిపారు. ఈ పరిస్థితులకు ఆజ్యం పోసిన వ్యక్తులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే పరస్పర దాడులకు పాల్పడిన రెండు గ్రామాలకు చెందిన వ్యక్తులను గుర్తించామని, వారిపై కేసులు కూడా నమోదు చేశామన్నారు. ప్రస్తుతం కేసులో ఉన్నవారు గతంలోనూ ఇలాంటి పరిస్థితులకు కారకులైతే, అటువంటి వారిపై రౌడీషీట్లు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికైనా పరిస్థితులను అర్థం చేసుకుని ఇరుగ్రామాల్లో ఉన్న పెద్దలు శాంతియుత వాతావరణం కల్పించాలని కోరారు. పరిస్థితులు అదుపులోకి వచ్చేంత వరకు రెండు గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

వీసీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

తిరుపతి సిటీ: జిల్లాలోని యూనివర్సిటీలకు పూర్తిస్థాయి వైస్ చాన్సలర్లను నియమించేందుకు ఉన్నత విద్యామండలి అధికారులు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలోని ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీతో పాటు కుప్పం ద్రావిడియన్ యూనివర్సిటీలకు సంబంధించి ఆసక్తి, అర్హత గల వారు ఈనెల 28వ తేదీలోపు ఉన్నత విద్యామండలి అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో ఆశావాహులు పెద్దఎత్తున దరఖాస్తు చేసుకుని, లాబీయింగ్‌ల కోసం తమ అస్త్రశస్త్రాలను ఉపయోగించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ప్రధానంగా అధికార టీడీపీ, జనసేన పార్టీల అనుచరులుగా ముద్రపడిన ప్రొఫెసర్లు, రిటైర్డ్ అధ్యాపకులు తమ సన్నిహితులతో చర్చలు ప్రారంభించారు. తమ సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తారంటూ టీడీపీ అనుచరులు.. ఈ దఫా తమ సామాజిక వర్గానికే వీసీ పోస్టు దక్కుతుందంటూ జనసేన పార్టీ వారు ఊహాల పల్లకిలో విహరిస్తున్నారు. ఈ ఏడాది సుమారు ఒక్కో వర్సిటీ నుంచి ఆశావాహులు సుమారు 10 నుంచి 15మంది వరకు గట్టిపోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వీసీల నియామకం ప్రభుత్వానికి తలనొప్పిగా మారే అవకాశం కనిపిస్తోందని వర్సిటీలలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది.

10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తిరుమల: తిరుమల పాపనాశనం సమీపంలోని నిషేధిత అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి 10 దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ (ఆపరేషన్స్) టీం సురేష్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ఐటీ విష్ణువర్ధన్ కుమార్ టీం సోమవారం తిరుమల చేరుకున్నారు. వేద పాఠశాల మీదుగా పాపనాశనం వైపు వెళ్తుండగా, నిషేధిత అటవీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలతో కనిపించారు. వారిని పోలీసులు చుట్టుముట్టే ప్రయత్నం చేయగా పారిపోయారు. అయితే టాస్క్‌ఫోర్స్ టీమ్ వారిని వెంబడించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఆ ప్రాంతంలో 10 ఎర్రచందనం దుంగలు లభించాయి. నిందితులు తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమునామత్తూరుకు చెందిన వారిగా గుర్తించారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేయగా ఎస్ఐ రఫీ విచారిస్తున్నారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఇసుక కమిటీ నిర్ణయించిన రవాణా చార్జీలకు మించి వసూళ్లు చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ట్రాక్టర్లు, లారీలు, ట్రిప్పర్ల వాహనదారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల ఇసుక కమిటీ ప్రకటించిన ధరల మేరకు ఆయా వాహనాలు కిలోమీటర్ల మేర రవాణా చార్జీలను తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. సమావేశంలో జిల్లా గనుల శాఖ అధికారి ప్రకాష్ కుమార్, జిల్లా రవాణా అధికారి సుబ్రహ్మణ్యం, ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే వేగవంతం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

- స్పష్టమైన ఓటరు జాబితా సిద్ధం కావాలి

తిరుపతి అర్బన్: ఓటర్ల జాబితాకు సంబంధించి ఇంటింటికీ బీఎల్ఓలు వెళ్లి స్పష్టమైన నివేదికను తయారు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో పొరబాట్లు ఉంటే సంబంధిత అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఓటరుకార్డులో ఫొటో స్పష్టంగా ఉండాలని, కుటుంబ సభ్యులు అంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకుని, లోపాలు లేని డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ తయారు కావాలని సూచించారు. వచ్చే ఆదివారం నాటికి సర్వే పూర్తి చేయాలని సూచించారు. సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో సర్వే మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ గూడూరు రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, ఇతర మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు, గ్రామ, వార్డు సచివాలయ అధికారి సుశీల దేవి, డిప్యూటీ సీఈఓ ఆదిశేషా రెడ్డి, ఇతర జిల్లా, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతరలో పచ్చనేతల చిచ్చు

- కరకంబాడి కట్టపుట్టాలమ్మ జాతరలో రాజకీయ జోక్యం
- ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలపై అజమాయిషీ
- రాజకీయ జోక్యం ఏంటి అంటున్న ధర్మకర్తలు
- నేటి జాతరకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న ఆలయ ధర్మకర్త రామచంద్రయ్య



కట్టపుట్టాలమ్మ అమ్మవారు

రేణిగుంట: కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పార్టీల నేతలు అన్నిటా చిచ్చు రేపుతున్నారు. తాజాగా కరకంబాడిలో వెలసిన కట్టపుట్టాలమ్మ అమ్మవారి జాతరలో పోలీసుల అండతో పచ్చనేతలు రాజకీయ పెత్తనం చెలాయిస్తున్నారు. వంశపారంపర్య ధర్మకర్తలకు కనీస మర్యాదలు ఇవ్వకుండా జాతర నిర్వహణను ఏకపక్షంగా చేపడుతుండడం వివాదాస్పదంగా మారింది.

వంశపారంపర్య ధర్మకర్తలకు విలువేదీ..?

భక్తుల కోర్కెలను తీర్చే మూలపుటమ్మ కట్టపుట్టాలమ్మ తల్లిపై భక్తుల్లో విశ్వాసం పెరగడంతో ఆలయ ఆదాయం పెరిగింది. ఆలయ ధర్మకర్త వాసు ఆధ్వర్యంలో భక్తుల నుంచి వచ్చిన విరాళాలు, హుండీ కానుకలను కలిపి లెక్కించగా వచ్చిన రూ.1.5 కోట్లను బ్యాంకు ఖాతాలో జమ చేశారు. అయితే ఈ ఏడాది జాతర జరిపించాలని గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు చాటింపు వేయించారు. దీనిపై ఆలయ ధర్మకర్తలు అభ్యంతరం తెలపడంతో పోలీసులు జోక్యం చేసుకుని రాజీ కుదిర్చారు. అయితే జాతర నిర్వహణకు ఆలయ అకౌంట్ నుంచి రూ.10 లక్షలు డ్రా చేయడమే కాకుండా తమకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా హుండీని తెరిచి డబ్బులు తీసుకున్నారని ఆరోపిస్తూ వంశపారంపర్య ధర్మకర్తలు కుర్రకాల్వ రామచంద్రయ్య, కుర్రకాల్వ వాసు అభ్యంతరం తెలిపారు. దీంతో సోమవారం పోలీసులు బలవంతంగా వాసును పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాతర సవ్యంగా జరిగేలా సహకరించాలని సూచించి విడిచిపెట్టారు. జాతర ముగిశాక, జిల్లా ఉన్నతాధికారులు కలుగజేసుకుని ఆలయ నిర్వహణ బాధ్యతలను దేవదాయ శాఖకు అప్పగించాలని వారు కోరారు. ఈ మేరకు సోమవారం ధర్మకర్త రామచంద్రయ్య విలేకరులతో మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవంలో రాజకీయ పెత్తనం ఎందుకని ప్రశ్నించారు.

నేటి నుంచి కట్టపుట్టాలమ్మ జాతర..

కట్టపుట్టాలమ్మ జాతర మహోత్సవం మంగళ, బుధవారాల్లో జరిపేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం అమ్మవారికి అభిషేక పూజలు, విశేష అలంకరణ, పొంగళ్లు పెట్టి నైవేద్య సమర్పణ, అమ్మవారి దివ్య దర్శనం, 11వ తేదీన నాగహారతి, జాతర జరగనుంది.

అర్జీలకు పరిష్కారం చూపండి

- గ్రీవెన్స్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్
- మొత్తం 157 అర్జీలు
- అందులో అర్హత ఉండడంతో పింఛన్ ఇప్పించాలని పలువురి విన్నపం



గ్రీవెన్స్‌లో అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం ఆయనతోపాటు డీఆర్వో పెంచల కిషోర్, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, నరసింహులు, జిల్లా అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌కు ప్రతి విభాగానికి చెందిన జిల్లా అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్‌కు 157 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూ విభాగానికి సంబంధించి 93 అర్జీలు స్వీకరించారు.

పింఛన్ ఇప్పించండి..



కుమారుడు మునీశ్వర్‌తో జగదీశ్, చెంచుసుబ్బలక్ష్మి దంపతులు

మా కుమారుడు ఎం.మునీశ్వర్ లివర్ సమస్యతో బాధపడుతున్నారు. పింఛన్ ఇప్పించాలని తల్లిదండ్రులు జగదీశ్, చెంచు సుబ్బలక్ష్మి మొర పెట్టుకున్నారు. సోమవారం ఆ మేరకు కలెక్టర్‌ను కలిసి ఓ వినతిపత్రాన్ని అందజేశారు. తిరుపతి రూరల్ మండలంలోని దుర్గసముద్రం గ్రామానికి చెందిన తాము వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటామని చెప్పారు. అయితే తమ కుమారుడికి లివర్ సమస్య రావడంతో తండ్రి జగదీశ్ 200 గ్రాములు లివర్‌ను ట్రాన్స్‌ప్లాంట్ పద్ధతిలో ఇచ్చినట్లు చెప్పారు. పెద్దమొత్తంలో ఖర్చు చేశామని, ఇప్పటికీ లివర్ పనితీరు మెరుగుపడడానికి మందులు కొనుగోలు చేస్తున్నామని వివరించారు. తమ కుమారుడికి పింఛన్ ఇస్తే తమకు ఊరటగా ఉంటుందని తల్లిదండ్రులు కోరారు.

మాపైన దయ చూపండి సార్..



గ్రీవెన్స్‌కు వీల్‌చైర్‌లో భర్త భాస్కర్‌ను తీసుకొస్తున్న ఉష

తన భర్త భాస్కర్‌కు పక్షవాతంతో నోటిమాట సక్రమంగా రావడం లేదని, అంతేకాకుండా కాళ్లు, చేతులు పనిచేయడం లేదని వీల్‌చైర్‌లో భర్తను గ్రీవెన్స్‌కు తీసుకొచ్చిన ఉష అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్తకు దివ్యాంగ సర్టిఫికెట్లు ఉన్నాయని అధికారులకు విన్నవించారు. తిరుచానూరులోని ఉషోదయ కాలనీలో తాము నివాసం ఉంటున్నామని, న్యాయం చేయాలని గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చారు. ఇంటి నుంచి వీల్‌చైర్‌లోనే ఆమె కలెక్టరేట్‌కు భర్తను తీసుకొచ్చారు. మరి అధికారులు ఎంతమేరకు న్యాయం చేస్తారో చూడాలి.

సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడవచ్చు

– అర్బన్ జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

తిరుమల : అకస్మాత్తుగా కుప్పకూలినా, గుండెపోటుకు గురైన వ్యక్తులకు సకాలంలో కార్డియోపల్మనరీ రిసస్కిటేషన్(సీపీఆర్) చేయడం ద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చని తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం స్థానిక శ్రీవారి సేవాసదన్‌లో అర్బన్ జిల్లా పోలీసులు, రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ల ద్వారా తిరుమలలోని టీటీడీ నిఘా, భద్రతా సిబ్బంది, పోలీసు సిబ్బందికి, శ్రీవారి సేవకులు, స్కౌట్స్‌కు సీపీఆర్ శిక్షణపై అవగాహన కల్పించారు. ఇటీవల క్యూలైన్‌లో ఓ మహిళ గుండెపోటుతో కుప్పకూలి మృతిచెందిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఎస్పీ మాట్లాడుతూ.. శ్రీవారి దర్శనార్థం దేశవ్యాప్తంగా లక్షల మంది శ్రీవారి దర్శనానికి వస్తుంటారని అటువంటి వారిలో ఎవరైనా అనారోగ్యానికి, గుండెపోటుకు గురై కుప్పకూలిన సమయంలో వారికి అత్యవసరంగా సీపీఆర్ నిర్వహించే విధానంపై తమ సిబ్బందికి అవగాహన కల్పించామని తెలిపారు. అనంతరం శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మాడవీధులు, గ్యాలరీలు, బ్యారికేడ్ల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఎస్పీతో పాటు తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ విజయశేఖర్, సీఐలు విజయ్‌కుమార్, మురళీమోహన్ రావు, హరిప్రసాద్, వీజీఓ సురేంద్ర, టీటీడీ నిఘా, భద్రతా విభాగం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కదులుతున్న ట్రైన్ ఎక్కుతుండగా..



రవికాంత్(ఫైల్)

గూడూరురూరల్ : గూడూరు రైల్వే స్టేషన్‌లో కదులుతున్న రైలు కింద పడి ఓ వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు చెన్నై నుంచి కాశీకి బయలుదేరి వెళుతున్న గంగా కావేరి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న రవికాంత్(36) అనేవ్యక్తి గూడూరు రైల్వేస్టేషన్‌లో దిగాడు. అనంతరం రైలు బయలుదేరడంతో ఎక్కుతుండగా కాలు జారి రైల్వే ట్రాక్ కింద పడిపోయాడు. దీంతో అతని శరీరం రెండు ముక్కలైంది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించగా మృతుడి వద్ద ఉన్న పాన్‌కార్డు ద్వారా రవికాంత్ అని గుర్తించారు. అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ బయోటెక్నాలజీ, యూఎస్ఏలోని యూనివర్సిటీ ఆఫ్ హెమటాలజీ అండ్ అంకాలజీ, యూనివర్సిటీ ఆఫ్ అలబామా బర్మింగ్‌హోమ్ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 27 నుంచి మూడు రోజుల పాటు క్యాన్సర్‌పై జరిగే అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ సీహెచ్ అప్పారావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బయోటెక్నాలజీ, మెడిసన్, క్యాన్సర్ థెరప్యూటిక్స్ అనే అంశంపై వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు కన్వీనర్లుగా కేవీ సరిత, మల్లా మిథున్, డాక్టర్ గంజి పూర్ణచంద్ర, నాగరాజు వ్యవహరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రిన్సిపల్ తులసి రామకృష్ణారెడ్డి, విజయసారథిరెడ్డి, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.